# షాక్‌టైల్ పార్టీ

వినాయకరావ్ గృహప్రవేశం చేశాడు. అడుక్కుతినేవాళ్ళు కూడా ఇళ్ళు కట్టేసుకుంటున్న ఈ రోజుల్లో ఇదో విశేషమా అని ఈ విషయాన్ని కొట్టిపారెయ్యరాదు. ఎందుకంటే వినాయకరావ్ సంగతి తెలిసిన వాళ్ళకి అతడొక సొంతింటి వాడవటం గిన్నిస్‌బుక్ లోకి ఎక్కేనంత గొప్ప.

ఎందుకంటే అతడు పనిచేస్తున్న ప్రైవేట్ కంపెనీ లాంటి కంపెనీ ప్రపంచంలో ఎక్కడా ఉండదు. లోన్లు ఉండవు. అడ్వాన్సులు వుండవు. సెలవులుండవు. ఆఫీసు పని పూర్తయ్యాక ఇంటికెళ్ళినా సుఖం ఉండదు. ఏదో పనుందంటూ కబురొచ్చేస్తుంది. అలా అని ఓవర్ టైమ్ ఇస్తారా అని అంటే "మరీ ఓవర్‌గా మాట్లాడుతున్నావే నీ టైమ్ బాగులేనట్టుంది" అంటారు. ఇహ— బోనస్‌ల విషయానికొస్తే పుష్కరానికోసారి ఇస్తామని ప్రకటిస్తూ ఉంటారు. ఇవ్వరు. పోనీ జీతమైనా సరిగ్గా ఇస్తారా అంటే ఏదో కూరగాయలు కొనుక్కుంటున్నట్టు ఉండుండి ఉండుండి కొంత కొంత కొంత ఇస్తూ ఉంటారు. ఈ లెక్కన ఏ నెల జీతం ఏ నెల్లో తీసుకుంటున్నాడో లెక్కవేసుకోవటం మానేసి "ఎప్పుడెంత ఇస్తే అంత తీసుకోవటమే భగవంతుడు నా నొసటన రాశాడు" అనే 'ఖర్మ సిద్ధాంతానికి' అలవాటుపడిపోయాడు మానసికంగా.

అటువంటి వినాయకరావ్ సొంతింటి గురించి తలపెట్టడం సాహసమే కాదు తెగింపు కూడాను. ఆ తెగింపు కూడా సొంతంగా వచ్చింది కాదు. శ్రేయోభిలాషులందరూ అతడి చెవిలో ఇల్లుకట్టుకొని ఇల్లు కట్టుకోమని తెగపోరడమే కారణం.

"చూడూ వినాయకరావ్... నీ బ్రతుకెలాగూ అత్తెసరు అయిపోయింది. ఆడ పిల్లలు గలవాడివి. వాళ్ళ బ్రతుకులు కూడా నాశనం చేస్తావా? వాళ్ళ పెళ్ళికి కట్నం బాగా ఏమీ ఇవ్వలేకపోయినా ఇల్లంటూ ఒకటుంటే అది చూసైనా పెళ్ళికి ఒప్పుకునే వారుంటారు కదా!?" అని కన్విన్స్ చేశారందరూ.


మంచి స్థలం వెతుక్కొని, ఇల్లు శుభ్రంగా కట్టించుకునే తీరిక ఈ కంపెనీలో ఉంటుండగా అసాధ్యం కనుక ఫ్లాట్ కొనుక్కోడానికే నిశ్చయించుకున్నాడు. ఓ మంచి బిల్డర్‌ని పట్టుకొని ఊళ్ళోనే అతడు కడుతున్న ఫ్లాట్‌ని రిజర్వ్ చేసేసుకున్నాడు.

అదృష్టవశాత్తూ అతని స్నేహితులు, శ్రేయోభిలాషులు అందరూ మంచి మంచి పొజిషన్‌లతో ఉండటం వల్ల లోన్‌లు కూడా సులువుగానే శాంక్షన్ అయ్యాయి.

దాంతో వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లుంది వినాయకరావ్‌కి. తెగ రెచ్చిపోవటం మొదలెట్టాడు. ఇప్పటివరకూ రోజులు బాలేవు కదా ఇకనైనా బావుండాలని వాస్తు శాస్త్రానికి సంబంధించిన పుస్తకాలు స్టడీ చేశాడు. పెద్దవాళ్ళని కలిశాడు. విషయ సేకరణ చేసి వాస్తు విజ్ఞానంలో కొంత పరిజ్ఞానం సంపాదించాడు.

బిల్డర్‌ని కలిసి ఆ ప్రకారంగా తన ఫ్లాట్‌లో మార్పులు చేసుకోడానికి పర్మిషన్ ఆయా మార్పుల్ని అమలుపరిచాడు.

ముఖద్వారం తూర్పువైపు పెట్టించాడు. ఆగ్నేయ మూలలో వంట ఉంటే బావుంటుంది కాబట్టి కిచెన్ ప్లాట్‌ఫాం అలా వచ్చేట్టు చూసుకున్నాడు. ఈశాన్య మూలలో దేవుని పటాలు పెట్టించాడు. నీళ్ళు కూడా ఈశాన్యం గుండా వెళితే మంచిదని పైప్‌లైన్‌లు అలా మలిపించాడు. వాయవ్యం వైపు బరువు ఉంటే శ్రేష్ఠం అని, ఉత్తరాన ఉన్న కుబేర దృష్టి దక్షిణం వైపు పడు తుంది కాబట్టి దక్షిణ భాగాన ఉన్న గోడ త్రవ్వించి వాయవ్యమూలలో బరువు పడేట్టుగా బీరువాని ఉత్తరముఖంగా తెరుచుకునేట్టు దక్షిణంవైపు ఆనుకునేట్టు ఫిక్స్ చేశాడు. తల పడమరవైపు వచ్చేట్టుగా నైఋతి నుంచి గాలులు వీచేట్టుగా బెడ్‌రూమ్‌లో కిటికీ పెట్టించి మంచాలకు చోటు చేశాడు. వర్షం పడినప్పుడు నీరు టీవీ యాంటెన్న వైరు ద్వారా లోపలికి వచ్చి టీవీ పాడవకుండా ఆ వైరు కనక్షన్ వచ్చే చోట ఒక పైప్‌ని తిరగేసి పెట్టించాడు. దాని వల్ల వర్షం నీరు కిందపడిపోతుందే తప్ప లోపలికి ప్రవహించ లేదు. భవిష్యత్తులో రోజులు బావుంటే ఫోన్ పెట్టించుకోకపోతానా అని బెడ్‌రూమ్ నుంచి డ్రాయింగ్ రూమ్‌కి ఫోన్ లైన్లు ఫ్లోర్ అడుగు నుంచి ముందుగానే వేయించేసుకున్నాడు.




సరిగ్గా ఒక్క నెలంటే నెలలోనే ఇన్ని మార్పులూ జరిగిపోయాయి. లోను కటింగ్ మొదలవుతుంది కాబట్టి ఇంటి అద్దె ఇచ్చుకోలేనని ఫ్లాట్‌కి మారక తప్పదని బిల్డర్‌కి చెప్పి అతని నెత్తిమీద కూచుని మరీ వాటర్ కనెక్షను, పవర్ కనక్షనూ ఇప్పించుకొని గృహప్రవేశం చేసేశాడు.

అందరూ ఆనందించారు వినాయకరావ్ తీసుకున్న ఈ నిర్ణయానికి. ప్రశంసించినవాళ్ళే తప్ప విమర్శించిన వాడే లేడు.

ఈ నేపథ్యంలో స్నేహితులందరూ 'భూత శాంతి'... అనగా 'డ్రైవ్ ది డెవిల్ అవుట్' కార్యక్రమం చెయ్యాలన్నారు.

ఇక్కడ ఏ మాటకామాటే చెప్పాలి. అతని స్నేహితుల్లో హెల్ప్‌చేసే వాళ్ళకన్నా గల్ఫ్ చేసే వాళ్ళే ఎక్కువ. మామూలు సమయాల్లో ఎలా ఉన్నా మందు దగ్గరకొచ్చేసరికి మహా విచిత్రంగా ప్రవర్తిస్తారు. ఒక్కొక్కరిదీ ఒక్కొక్క బ్రాండు. ఒకడికి విస్కీయే కావాలి. ఇంకొకడికి బ్రాందీయే కావాలి. మరొకడికి జిన్ను. వేరొకడికి బీరు. "నా ఒంట్లో మధిరమ్ము ఇప్పటి వరకూ నేను తాగిన రమ్ము— అంచేత నన్ను రమ్ముతో కలువరమ్ము" అంటూ రమ్‌ని మాత్రమే తాగే 'రమ్యమైన' రమేష్ ఒకడు. ఇలా ఉన్నారు అతని ఫ్రెండ్స్.

ఏదైనా తాగగలిగే వాళ్ళు వీళ్ళ దృష్టిలో తాగు

బోతుల కింద లెక్క. ఏంచేతంటే విస్కీయైనా బ్రాందీయైనా కలిపి తాగగలిగేడనుకోండి. వాడు 'తాగుబోత్ (Both)' అన్నమాట. అలా ఆట పట్టిస్తారు. అంచేత అందరికీ కలిపి కామన్‌గా ఓ డ్రింకు తెచ్చేందుకు వీలులేదు. వచ్చినట్టు అన్ని బ్రాండ్‌లూ తెప్పించాల్సిందే!

అలాగే తిండి దగ్గిర కూడా ఒక్కొక్కరిదీ ఒక్కో టేస్ట్. ఒకడికి చికెను, ఒకడికి మటను, మరొకడికి ఫిష్, వేరొకడికి ప్రాన్సు, ఇంకొకడికి బీఫ్... ఇలా చెప్పుకుంటూ పోతే వేంతాళ్ళు చిన్నవి అయిపోతాయి.

పాపం... ఫ్రెండ్సంటే ప్రాణం ఇచ్చే తత్వం కాబట్టి అన్నింటికీ సిద్ధపడ్డాడు వినాయకరావ్. ఏవైనా ఉంటే బైట్నుంచి తెప్పించుకోండి గాని నన్ను ఆ వైపు పిలవొద్దంతే' అంది వాళ్ళావిడ.

సరే... ఇంతా చేసి ఆఖర్న అసంతృప్తి ఎందుకని పార్టీకి కావలసిన ధనం కూడా మళ్ళీ ఫ్రెండ్స్ దగ్గిరే చందాలెత్తి మొత్తానికి 'పార్టీ ఫండు' పోగు చేసి ఓ శుభ సాయంత్రాన అందర్నీ పిలిచాడు.

విందు మహా కోలాహలంగా సాగిపోతోంది. ఎవడికి వాడు వాడి ధోరణిలో తాగేస్తున్నారు, తినేస్తున్నారు, వాగేస్తున్నారు, వినేస్తున్నారు.

వినాయకరావ్ మటుకు అందరికీ ఎంతో సహనంతో సర్వ్ చేస్తూ ఓపిగ్గా ఎదురుచూస్తున్నారు— తన స్నేహితులు తన ఇంటి గురించి చెప్పబోయే మాటల కోసం.

అందరికీ తను పడ్డ కష్టాలు, వాస్తు ప్రకారం తీర్చిదిద్దుకున్న వైనం అంతా తెలుసు. ఏ ఒక్కడైనా వాటి గురించి ప్రస్తావించి వీటి గురించి ప్రశంసిస్తే పులకించిపోదామని అతని ఆకాంక్ష.

రాత్రి పన్నెండయింది... ఒంటిగంటయింది... రెండు సమీపిస్తోంది. వచ్చిన వాళ్ళందరూ మెల్లగా జారుకోవడం మొదలుపెట్టారు ఒక్కొక్కరుగా...

ఒక్కడు... ఒక్కడంటే ఒక్కడు కూడా వినాయకరావ్ మనసుని చల్లబరిచే ఆ ఒక్క మాట ప్రస్తావించలేదు.

రెండయింది. అందరూ అయిపోయారు. ఆఖర్న మిగిలిందొక శాస్త్రి. వీళ్ళందరి దృష్టిలో అతనో 'తాగుబోత్'. ఆ రోజు అతను రెచ్చిపోయి తాగుబోత్, భోత్, బోత్ అయిపోయి బ్రాందీ, విస్కీ, జిన్ను, రమ్ము, బీరు అన్నీ కలిపి మరీ కొట్టేశాడు. కాక్‌టెయిల్ షాక్‌టెయిల్ అవుతుందన్నా వినలేదు. అతడు లేచాడు... సారీ... లేవాలనుకుంటున్నాడు... బయల్దేరడానికి.

వినాయకరావ్ వెళ్ళాడతని దగ్గిరికి లేవనెత్తడానికి. మొత్తానికి నిలబడగలిగాడతను వినాయకరావ్ సహాయంతో. వెళ్ళబోతూ ఆగి వెనక్కి తిరిగి "వినాయకరావ్— ఇందాకట్నుంచి గమనిస్తూనే ఉన్నాను. అందరూ తెగ తాగి, తిని వెళ్ళారే గాని ఒక్కడూ కూడా నీ గురించి, నీ ఇంటి గురించి మాట్లాడలేదు అవునా?" అన్నాడు.

వినాయకరావ్ నుండి ఆనందంతో ఉప్పొంగిపోయింది— "అవును గురూ" అన్నాడు.


"అందుకే ఇప్పుడు నీకు నేను నీ ఇంటి గురించి చెప్పదలుచుకున్నాను" అంటూ వాస్తు శాస్త్ర రీత్యా వినాయకరావ్ చేసినవన్నీ వరసపెట్టి పొగిడాడు.

వినాయకరావ్ కంటి వెంట ఆనందబాష్పాలు రాలాయి. 'ఒక్కడైనా గుర్తించినందుకు తరించింది జన్మ' అనుకున్నాడు. "పద గురూ నిన్నా ఇంటి దగ్గిర దిగబెడతాను" అన్నాడు.

"అక్కర్లేదు వినాయకరావ్... చూస్తున్నావుగా... నేను అస్సలు చెక్కు చెదరలేదు. కాకపోతే ఒక్కటే నాకనిపిస్తోంది..." అన్నడా శాస్త్రి అనుమానంగా.

"ఏంటి గురూ?" అడిగాడు వినాయక రావు ఆత్రుతగా.

"ఏం లేదు... ఇల్లు ఎందుకు కాస్త ఊగుతున్నట్టు అనుమానంగా ఉంది. బహుశా నిన్ను ఆ బిల్డర్ మోసం చేశాడనుకుంటా ఎందుకైనా మంచిది మరో ఇంజనీర్‌ని పిలిపించి చెక్ చేయించు" అంటూ నిష్క్రమించాడా శాస్త్రి వాలా.



### సీసాలు

"అవునొదినా... మీ వారు ఇంటికి తీసుకు వచ్చి, మరీ తాగుతుంటే... నువ్వు చూస్తూ ఊరుకుంటావేమిటి?!"

"అది కాదు వదినా... ఇంటి దగ్గర తాగద్దు అన్నాము అంటే బార్‌లోనే తాగి ఆ సీసాలు అక్కడే వదిలి వస్తారు... అదే ఆయన ఇంటి దగ్గర తాగనిస్తే... ఆ ఖాళీ సీసాలు వేటికైనా పనికొస్తాయి.

"......"

".......!!!.....?"

—సాయిగంగాధర్ చామర్తి

## అద్భుత ప్రపంచం

# కబుర్లతో సంపాదన

హాలీవుడ్‌లో ఆ హీరో అంటే పిచ్చి అభిమానం. అతను నటించిన చిత్రాలకి ప్రపంచ వ్యాప్తంగా కనకవర్షం కురిసింది. అతనంటే వెర్రి అభిమానంతో మేం అంటే మేం అంటూ ఎందరో సుందరాంగులు తమ సర్వస్వం అర్పించటానికి తయారయ్యారు. అటువంటి వ్యక్తి ముద్దుల భార్య ఎంత అదృష్టవంతురాలో అని ఎవరికైనా అనిపిస్తుంది. కానీ అంతటి ఉన్నత స్థితి నుంచి వైదొలగాల్సివస్తే ఆ స్త్రీ పరిస్థితి ఎలా వుంటుందో!

సరిగ్గా అదే జరిగింది బ్రిగెట్టి విషయంలో. భర్తతో విడిపోవాల్సి వచ్చింది. విడాకుల నష్ట పరిహారం కింద 250 లక్షలు లభించినా ఆమె ఆర్థిక ఇబ్బందులు తీరలేదు. అత్యంత ఖరీదైన జీవితం అనుభవించిన ఆమెకి డబ్బుకావాలి.

అద్భుతమైన ఆలోచనని ఆచరణలో పెట్టింది బ్రిగెట్టి. దరిదాపు వెయ్యి డాలర్లు చెల్లిస్తే ఆమె ఒక సాయంత్రమంతా వచ్చి వారితో గడుపుతుంది. గడపటమంటే ఏదైనా ఖరీదైన స్థలంలో కలిసి భోంచెయ్యటం. సరదాగా ఏమైనా వినోద స్థలానికి రావటం. వీటితోపాటు తనివితీరా కబుర్లు చెప్పటం. 'మీరడిగే ప్రశ్నలకి ఏ దాపరికం లేకుండా నా మనసులో వున్నది చెపుతా' అన్న బ్రిగెట్టి ప్రకటన చాలామందిని ఆకర్షించింది. దరిదాపు పన్నెండువేలమంది ఆమెతో కబుర్లతో కాల క్షేపం చెయ్యటానికి వెయ్యి డాలర్లు అంటే ఇంచు మించు పాతికవేలు రూపాయలు ఒక సాయంత్రానికిగాను ఖర్చు చెయ్యటానికి సిద్ధపడుతున్నారు. వరుసక్రమంలో ఒక్కొక్కరికీ ఒకో సాయంత్రం కేటాయిస్తే ఆఖరి వ్యక్తికి ఎన్నో ఏళ్ళ తర్వాత ఛాన్స్ వస్తుంది. అయినా పురుష పుంగవులు ముందుగా డబ్బు చెల్లించి ఓపిగ్గా వేచి ఉండటానికి సిద్ధంగా వున్నారు. ఈ దెబ్బతో బ్రిగెట్టి దరిద్రం తీరిపోతుంది.

'అసలు ఇలాంటి ఆలోచన ఎలా వచ్చింది?' అన్న ప్రశ్నకి. 'ఎక్కడో ఓ జానపద కథలో చదివాను' అంటోంది తన తెలివితేటలకి మురిసిపోతూ బ్రిగెట్టి.

—రావు.